


# కరపత్రం

SINCE 2014

శుక్రవారం ఫిబ్రవరి 14 2025 | సంపుటి :0 | సంచిక : 123 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు: 4

## కేసీఆర్ అధ్యక్షతన 19న బిఆర్ఎస్ విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశం



ఈ నెల 19న భారత రాష్ట్ర సమితి విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం జరుగనున్నది. బీఆర్ఎస్ పార్టీ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు అధ్యక్షతన జరిగే విస్తృత స్థాయి సమావేశానికి తెలంగాణ భవన్ వేదిక కానున్నది. త్వరలోనే పార్టీ సిల్వర్ జూబ్లీ వేడుక జరుగనున్నది. ఈ క్రమంలోనే విస్తృత స్థాయి కార్యవర్గాన్ని సమావేశ పరచాలని కేసీఆర్ నిర్ణయించారు. ఈ మేరకు భేటీ నిర్వాహణకు సంబంధించి పార్టీ కార్యవర్గ నిర్వహణ అధ్యక్షుడు కేటీఆర్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఈ భేటీలో బీఆర్ఎస్ సిల్వర్ జూబ్లీ వేడుకలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు, పార్టీ నిర్మాణం, నిర్మాణాత్మక అంశాలపై చర్చించనున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు, ప్రభుత్వ వైఫల్యాలలపై చర్చించడంతో పాటు వాటిని ఎండగట్టేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించి.. ప్రజలను చైతన్యం చేసేందుకు అనుసరించాల్సిన విధానాలపై శ్రేణులకు దిశానిర్దేశం చేయనున్నారు.

# గచ్చిబౌలిలో మైక్రోసాఫ్ట్ కొత్త క్యాంపస్..

# ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి

- మైక్రోసాఫ్ట్-తెలంగాణ ప్రభుత్వం కీలక ఒప్పందం - హైదరాబాద్‌లో ఏఐ సిటీ ఏర్పాటుకు భాగస్వామ్యం.
- 15,000 కోట్ల పెట్టుబడులు - మైక్రోసాఫ్ట్ ఏఐ పరిశ్రమలో భారీ పెట్టుబడి ప్రకటన.
- 1.2 లక్షల మందికి ఏఐ శిక్షణ - మూడు కొత్త శిక్షణా కార్యక్రమాలతో ఏఐ నైపుణ్యాల అభివృద్ధి.
- 500 ప్రభుత్వ పాఠశాలల్లో ఏఐ కోర్సులు - 50,000 మంది విద్యార్థులకు మైక్రోసాఫ్ట్ ఏఐ ఫౌండేషన్స్ అకాడమీ ద్వారా శిక్షణ.
- 20,000 మంది నిపుణులకు నైపుణ్యాభివృద్ధి - ఏఐ ఇండస్ట్రీ ప్రో కార్యక్రమంతో శిక్షణ అందించనున్న మైక్రోసాఫ్ట్.
- 50,000 మంది అధికారులకు శిక్షణ - సైబర్ సెక్యూరిటీ, డిజిటల్ ప్రొడక్టివిటీలో నైపుణ్యాల పెంపు.

## హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ కొత్త క్యాంపస్



2లో

# లోక్‌సభలో కొత్త ఇన్‌కమ్ ట్యాక్స్ బిల్లు:

# మార్పులు, చేర్పులు ఇవే

- 1961 చట్టాన్ని సరళతరం చేసి, సులభమైన భాషలో రూపొందించారు.
- కొత్త పన్నులు లేకుండా, ప్రస్తుతం ఉన్న వసూలు విధానాన్ని కొనసాగిస్తున్నారు.
- 536 సెక్షన్లు, 16 షెడ్యూళ్లు కలిగి 622 పేజీల నూతన చట్టం.
- పన్ను సంవత్సరంగా "ట్యాక్స్ ఇయర్" పదాన్ని ప్రవేశపెట్టి, పన్ను చెల్లింపుదారుల హక్కుల కోసం ప్రత్యేక చార్టర్ చేర్పించారు.




కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్.. గురువారం(ఫిబ్రవరి 13) కొత్త ఆదాయపు పన్ను బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు.

2లో

## హైదరాబాద్‌లో గూగుల్ ఏఐ కేంద్రం.. సీఎం సమక్షంలో ఎంవోయూ



హైదరాబాద్: నగరంలో ఏఐ కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్టు గూగుల్ ప్రకటించింది. ఈ మేరకు ఆ సంస్థ రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం చేసుకుంది. టీహబ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి , ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు సమక్షంలో గూగుల్ ప్రతినిధులు ఎంఓయూ కుదుర్చుకున్నారు. కృత్రిమ మేధ అంకుర పరిశ్రమలకు గూగుల్ తోడ్పాటునందించనుంది. వ్యవసాయం, విద్య, రవాణారంగం, ప్రభుత్వ డిజిటల్ కార్యకలాపాలకు గూగుల్ ఏఐ కేంద్రం సహకరిస్తుందని ఆ సంస్థ ప్రతినిధులు వెల్లడించారు.

## కోడి పందేల నిర్వహణ కేసు..

### భారాస ఎమ్మెల్సీకి పోలీసుల నోటీసులు



2

### కుల గణనపై ప్రభుత్వ వైఫల్యాన్ని డిప్యూటీ సీఎం భట్టి ఒప్పుకున్నరు : ఎమ్మెల్యే కేపీ వివేకానంద



2

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కుల గణనపై ప్రభుత్వ వైఫల్యాన్ని ఒప్పుకున్నారని కుత్బుల్లాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద అన్నారు. తెలంగాణ భవన్‌లో ఆయన గురువారం మీడియా సమావేశం నిర్వహించారు.

### పాతికేళ్ల ప్రస్థానం..

ఫిబ్రవరి 19న భారాస విస్తృతస్థాయి సమావేశం



2

పాతికేళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంటున్న వేళ రజతోత్సవ వేడుకల నిర్వహణతో పాటు పార్టీ నిర్మాణం, భవిష్యత్ కార్యాచరణపై చర్చించేందుకు భారత రాష్ట్ర సమితి సిద్ధమైంది.

### రూ.2కోట్ల విలువైన బంగారం, వజ్రాలు చోరీ.. ముగ్గురి అరెస్ట్



2

హైదరాబాద్: నారాయణగూడ పీఎస్ పరిధిలో చోరీ కేసును పోలీసులు ఛేదించారు. చోరీకి పాల్పడిన ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు.

## భారాస అగ్ర నేతలు సర్వేలో పాల్గొని చిత్తశుద్ధి నిరూపించుకోవాలి



2లో

- తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వే ఇతర రాష్ట్రాలకు మార్గదర్శకంగా నిలుస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.
- కొంత మంది తమ వివరాలు అందించకపోవడంతో ఫిబ్రవరి 28 వరకు గడువు పెంచినట్లు తెలిపారు. ఇది రీసర్వే కాదని స్పష్టం చేశారు.
- భాజపా వ్యాపారవర్గాల అనుకూల పార్టీ అని, బీసీ ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకమని ఆరోపించారు.

కరపత్రం తెలుగు దిన పత్రిక



## సంపాదకీయం

### ఆప్ ఓటమి ప్రజాస్వామ్య విజయమేనా?

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలలో ఆమ్ ఆద్మీ పార్టీ ఓడిపోయింది. మధ్యతరగతి ఓటర్లు మందహాసం చేస్తున్నారు. అరవింద్ కేజ్రీవాల్ ప్రత్యర్థులు ఆనంద తాండవం చేస్తున్నారు. క్షమించాలి, నేనీ విజయోత్సవాలలో పాల్గొనలేను. ఇది నిజంగా 'ఆమ్ ఆద్మీ' విజయమేనా అని ప్రశ్నిస్తున్నాను. పది సంవత్సరాల క్రితం ఆప్‌లో పనిచేస్తున్న మాలో కొంతమందిపై పుకార్లు పుట్టించి, అవమానించి గెంటివేసిన వైనాన్ని నేను మరచిపోయానని మీరు పొరపడవద్దు. ఒక విశాల రాజకీయ సన్నివేశం గురించి యోచిస్తున్నప్పుడు నా వ్యక్తిగత అనుభవాలు, ఎంత చేదువైనా, ఆ వివేచనను ప్రభావితం చేయడాన్ని అనుమతించను. ఢిల్లీ ఎన్నికలలో బీజేపీ గెలుపు, ఆప్ ఓటమి ఆ విస్తృత రాజకీయ సన్నివేశంలో ఒక భాగం మాత్రమే. ఆ ఆలోచన నా గురించి కాదు, ఆప్, దాని నాయకుల గురించీ కాదు. నేను ముందే ప్రస్తావించినట్టు అది 'ఆమ్ ఆద్మీ' గురించి. చింత, కలత, ఆందోళన మిళితమైన మనసుతో నిట్టూరుస్తున్నాను.

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు ఆప్ పదేళ్ల పాలన ఒక ప్రజాభిప్రాయ సేకరణ. ప్రజలు ఆప్ పాలనను నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. ఢిల్లీ ప్రజల ఆప్ తిరస్కారం బీజేపీకి అధికార లబ్ధిని సమకూర్చింది. గమనించారా? పరాజిత ఆప్, విజేత బీజేపీ మధ్య ఓట్ల శాతం కేవలం 3.5శాతం మాత్రమే. బీజేపీ సాధించుకున్న సీట్ల సంఖ్యను సూచిస్తే విజేత ఓట్ల వాటా పరాజిత ఓట్ల వాటా కంటే చాలా అధికంగా ఉండవచ్చనే భావన కలుగుతుంది. అయితే వాస్తవంగా ఆ రెండు వాటాల మధ్య తేడా ఊహాత్మక అంచనా కంటే చాలా తక్కువగా లేదూ?!

ఢిల్లీ ఎన్నికల ఫలితం ఎటువంటి పరిస్థితులలో విరుద్ధంగా ఉండేదో ఊహించడం కష్టమేమీ కాదు. అవినీతి ఆరోపణలు ప్రజల దృష్టికి వెళ్లకుండా ప్రసార మాధ్యమాలు బీజేపీ నాయకులను కాపాడిన విధంగానే ఆప్ నేతలనూ ఆదుకున్నట్టయితే పరిస్థితి మరో విధంగా ఉండేది. ఢిల్లీ ఎన్నికలు కేంద్ర బడ్జెట్‌కు ముందే నిర్వహించేందుకు ఎన్నికల సంఘం శ్రద్ధ చూపి ఉన్నట్టయితే, అలాగే ఢిల్లీ ఓటర్లను లక్ష్యం చేసుకునేందుకు కేంద్ర బడ్జెట్‌ను అనుమతించబోమన్న తన హామీకి ఈసీ కట్టుబడి ఉన్నట్టయితే పరిస్థితి భిన్నంగా ఉండేది. మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, జార?ండ్‌లో వలే మహిళలకు నగదు బదిలీ పథకాన్ని అమలుపరచడంలో ఢిల్లీ ప్రభుత్వాన్ని లెఫ్టినెంట్ గవర్నర్ నిరోధించకుండా ఉన్నట్టయితే ఓటర్లు అంతగా ఆప్‌కు వ్యతిరేకమయ్యేవారు కాదు అని నిశ్చితంగా చెప్పవచ్చు. ఆప్, కాంగ్రెస్‌లు పొత్తు పెట్టుకోకపోయినా ఎక్కడ పోటీ చేయాలి, ఎన్ని సీట్లకు పోటీ చేయాలి అనే విషయమై అవగాహన కుదుర్చుకున్నట్లయితే ఈ రెండు పార్టీల పరిస్థితి మరింత మెరుగ్గా ఉండేది. ప్రస్తావించిన వాటిలో ఏ ఒక్కటైనా సంభవించి ఉన్నట్టయితే మరో 2 శాతానికి పైగా ఓట్లు ఆప్‌కు చేకూరేవి. ఎన్నికల ఫలితాలపై పతాక శీర్షికలు భిన్నంగా ఉండేవి. ఇదే సమయంలో ఓటర్లలో 'ప్రభుత్వ వ్యతిరేకత' చాలా తీవ్రంగా ఉందన్నది ఒక కొట్టివేయలేని వాస్తవం. అయితే ఈ వ్యతిరేకతను ఓట్ల వాటాల వైనం పూర్తిగా ప్రతిబింబించలేదు. ప్రజల శ్రేయస్సుకు సంబంధించిన వివిధ అంశాల%–అభివృద్ధి, రోడ్లు, పారిశుద్ధ్యం, తాగు నీటి సరఫరా– లో ఆప్ సర్కార్‌పై ప్రజల్లో భ్రమలు పూర్తిగా తొలగిపోయాయని సిఎస్‌డిఎస్–లోక్‌నీతి సర్వే ధ్రువీకరించింది. ఆప్ ప్రభుత్వం పనితీరుపై ప్రజల సంతృప్తి, కేంద్ర ప్రభుత్వ పనితీరు పై కంటే తక్కువగా ఉన్నది. అరవింద్ కేజ్రీవాల్‌కు వ్యక్తిగతంగా ప్రజాదరణ ఆ పార్టీకి లభించిన ఓటర్ల వాటా కంటే తక్కువగా ఉన్నది. అవినీతి నిర్మూలన నినాదంతో ప్రభవించిన ఆప్ ప్రభుత్వం 'పూర్తి'గా లేదా 'కొంతమేరకు' అవినీతి సర్కార్ అని ఢిల్లీ ఓటర్లలో మూడింట రెండు వంతుల మంది అభిప్రాయపడడం దిగ్భ్రాంతికరమైన విషయం. ఆప్‌కు ఓటు వేసిన ఢిల్లీ ఓటర్లలో చాలా మంది ఆ పార్టీని అంతగా ఇష్టపడడం లేదన్నది కూడా నిరాకరించలేని వాస్తవం. ఆప్‌కు ఒక గట్టి ప్రత్యామ్నాయం ఉన్నా, బీజేపీ తరఫున విశ్వసనీయమైన ముఖ్యమంత్రి అభ్యర్థి ఉన్నా లేదా కాంగ్రెస్ ఒక గెలుపు గుర్రంగా కనిపించినా ఈ ప్రజాభిప్రాయసేకరణలో ఆప్ పట్ల మరింత వ్యతిరేకత వ్యక్తమై ఉండేది. అవును, ఈ ఎన్నికల పరాజయం ఆప్‌కు పూర్తిగా యుక్తమైనదే. అయితే అందుకు సంతోషించవలసింది ఏమీ లేదు. నిజానికి రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యం మన దేశంలో సుస్థిరంగా వర్థిల్లాలని కోరుకుంటున్న వారు ఆప్ ఓటమిలోని అపశకునాలకు ఆందోళన చెందాలి, మన గణతంత్ర రాజ్య భవిష్యత్తు గురించి శ్రద్ధతో ఆలోచించాలి. ఆప్ ఓటమికి నేను చింతిస్తున్నాను – ఆ పార్టీకి నేను అభిమానిని అయినందువల్ల కాదు. రాజకీయాలలో మౌలిక పరివర్తన సాధించేందుకు ప్రభవించిన పార్టీ అది. ఆవిర్భవించిన మొదటి రెండు సంవత్సరాలలోనే ప్రజామోదం సంపూర్ణంగా పొందిన పార్టీ అది. ఆ పార్టీ అధినేత వ్యక్తిపూజను ప్రోత్సహించాడు, సకల అధికారాలనూ తన చేతుల్లో కేంద్రీకరించుకున్నాడని నిక్కచ్చిగా చెప్పక తప్పదు. ఇక ఆయన సన్నిహితులు, ఆంతరంగికులు నిగూఢ రాజకీయాలు చేశారు, రెండు నాల్కలతో మాట్లాడారు, సాధారణ పార్టీ కార్యకర్తను లక్ష్యపెట్టలేదు. ఏతావాతా ఏ పార్టీల నయితే అధికారం నుంచి, జాతి రాజకీయ జీవితం నుంచి తొలగించేందుకు పుట్టిందో ఆ ప్రధాన స్రవంతి రాజకీయ పక్షాల కంటే ఆప్ భిన్నమైనది కాదని రుజువయింది. మీడియాలో ముఖ్యమంత్రి నివాసం 'శీష్ మహల్' గురించి అతిశయోక్తులతో ఉధృత ప్రచారం జరిగింది. పార్టీ నాయకులు పదే పదే మాట్లాడిన గాంధేయ ఆదర్శాలకు విరుద్ధంగా వారి జీవన శైలి ఉన్నందునే మీడియా నిశిత విమర్శలు అనివార్యమయ్యాయి

# గచ్చిబౌలిలో మైక్రోసాఫ్ట్ కొత్త క్యాంపస్.. ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి

మొదటిపేజీ తరువాయి

ప్రముఖ దిగ్గజ ఐటీ కంపెనీ మైక్రోసాఫ్ట్ హైదరాబాద్ గచ్చిబౌలిలో ఏర్పాటు చేసిన కొత్త క్యాంపస్‌ను సీఎం రేవంత్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం, మైక్రోసాఫ్ట్‌కు రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య కీలక ఒప్పందం కుదిరింది. ఒప్పందంలో భాగంగా ప్రభుత్వ భాగస్వామ్యంతో ఏఐ సిటీలో మైక్రోసాఫ్ట్ సరికొత్త ఏఐ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నది. ఏఐ రంగంలో కొత్తగా రూ.15వేల కోట్లు పెట్టుబడులు పెట్టనున్నట్లు మైక్రోసాఫ్ట్ ప్రకటించింది. అలాగే రాష్ట్రంలో 1.2లక్షల మందికి ఏఐలో శిక్షణ ఇచ్చేందుకు మూడు కొత్త కార్యక్రమాలను ప్రారంభించనున్నది.

అడ్వాంటేజ్ తెలంగాణ కార్యక్రమం కింద రాష్ట్రంలోని 500 ప్రభుత్వ పాఠశాలల్లో ఏఐ కోర్సును పరిచయం చేసేందుకు మైక్రోసాఫ్ట్ ఏఐ ఫౌండేషన్స్ అకాడమీ ప్రారంభించనున్నది. దాంతో దాదాపు 50వేల మంది విద్యార్థులకు శిక్షణ ఇస్తుంది. ఏఐ ఇండస్ట్రీ ప్రో పేరుతో మరో కార్యక్రమాన్ని చేపడుతుంది. 20వేల మంది నిపుణులకు నైపుణ్యాభివృద్ధి కోసం శిక్షన ఇస్తుంది. ఏఐ–సీఓఈని ఏర్పాటు చేసి ఏఐ గవర్న్ ఇనిషియేటివ్ పేరుతో 50వేల మంది అధికారులకు ఏఐ, సైబర్ సెక్యూరిటీ, డిజిటల్ ప్రొడక్టివిటీ తదితర కీలక రంగాల్లో శిక్షణ ఇవ్వనున్నది. అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అభివృద్ధితో పాటు రాష్ట్రంలో హైపర్ స్కేల్ ఏఐ డేటా సెంటర్లలో పెట్టుబడులు రెట్టింపు చేస్తామని ప్రకటించింది.

ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ మైక్రోసాఫ్ట్‌కు ధన్యవాదాలు తెలిపారు. హైదరాబాద్‌కు మైక్రోసాఫ్ట్‌కు మధ్య విడదీయలేని సుదీర్ఘ అనుబంధం ఉందన్నారు. హైదరాబాద్‌లో కొత్త ఫెసిలిటీని ప్రారంభించడం మనందరికీ గర్వకారణమన్నారు. హైదరాబాద్‌తో కలిసి చేస్తున్న ప్రయాణంలో ఇదొక మైలురాయిగా నిలుస్తుందన్నారు. హైదరాబాద్ నేడు ప్రపంచంలోనే టెక్నాలజీ పవర్ హౌస్‌గా, సరికొత్త ఆవిష్కరణలకు, ప్రపంచ ప్రతిభను ఆకర్షించే నగరంగా మారిందన్నారు. మైక్రోసాఫ్ట్ భాగస్వామ్యంతో భవిష్యత్తు మరింత ఉన్నతంగా ఉంటుందని.. తెలంగాణపై నమ్మకం ఉంచిన మైక్రోసాఫ్ట్ నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు. మైక్రోసాఫ్ట్ నిబద్ధత తెలంగాణ రైజింగ్ విజన్‌కు తోడవుతుందన్నారు. కార్యక్రమంలో మంత్రి శ్రీధర్‌బాబు, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, మైక్రోసాఫ్ట్ ఇండియా డెవలప్‌మెంట్ సెంటర్ మేనేజింగ్ డైరెక్టర్ రాజీవ్ కుమార్, ఇతర ప్రతినిధులు

# కోడి పందేల నిర్వహణ కేసు.. భారాస ఎమ్మెల్సీకి పోలీసుల నోటీసులు

మొదటిపేజీ తరువాయి

ఫామ్‌హౌస్‌లో పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు

హైదరాబాద్: నగర శివారులోని మొయినాబాద్ మండలం తొల్కట్ట ఫామ్‌హౌస్‌లో కోడి పందేల నిర్వహణ కేసులో భారాస ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డికి పోలీసులు నోటీసులు జారీ చేశారు. మాదాపూర్‌లోని ఆయన నివాసానికి వెళ్లి నోటీసులు అందజేశారు. కోడి పందేల నిర్వహణపై వివరణ ఇవ్వాలని అందులో పేర్కొన్నారు. ఫామ్‌హౌస్‌ను భూపతిరాజు అనే వ్యక్తికి లీజుకు ఇచ్చామని ఎమ్మెల్సీ చెబుతున్న నేపథ్యంలో దీనికి సంబంధించిన సమగ్ర సమాచారం ఇవ్వాలని పోలీసులు ఆయనకు నోటీసులు ఇచ్చారు. ఈ కేసులో శ్రీనివాస్‌రెడ్డిని సైతం పోలీసులు నిందితుడిగా చేర్చారు.

మంగళవారం పొద్దుపోయాక పోలీసులు నిర్వహించిన దాడుల్లో మొత్తం 61 మంది చిక్కిన విషయం తెలిసిందే. వారి వద్ద రూ.30 లక్షల నగదు, జూదక్రీడలో ఉపయోగించే రూ.కోటి విలువైన బెట్టింగ్ కాయిన్లు దొరికాయి. పోలీసులు 50 కార్లు, 80 పందెం కోళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో ఎక్కువ మంది వ్యాపారులే. అందరికీ నోటీసులిచ్చి వదిలేశారు. పోలీసులు వస్తున్న విషయం తెలుసుకుని కొందరు పరారయ్యారు. దాంతో పరారైన వ్యక్తులెవరనే దానిపైనా పోలీసులు ఆరా తీస్తున్నారు.

# కుల గణనపై ప్రభుత్వ వైఫల్యాన్ని డిప్యూటీ సీఎం భట్టి ఒప్పుకున్నరు : ఎమ్మెల్యే కేపీ వివేకానంద

మొదటిపేజీ తరువాయి

రూ.200కోట్లతో చేపట్టిన సర్వేతో రెండుకోట్ల మంది బడుగు, బలహీనవర్గాలను అవమానించారని ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యం భట్టి మాటలతో తేట తెల్లమైందని.. నిపుణుల మాటలను ప్రభుత్వం పెడచెవిన బెట్టిందని ఆరోపించారు. సర్వే చేతకాని ప్రభుత్వం మంచి పాలన ఎలా అందిస్తుంది? అని ప్రశ్నించారు. రేవంత్ సర్కారు ఏది చేసినా తిరోగమనమేనని.. అన్నింటా ప్రభుత్వం అభాసు పాలవుతోందన్నారు. బీఆర్ఎస్ సహా బీసీ సంఘాలన్నీ రీ సర్వేకు డిమాండ్ చేశాయన్నారు. కులాల జనాభాను కుట్ర పూరితంగా తక్కువ చేసి చూపించారని మండిపడ్డారు. కూడికలు తీసివేతలతో సర్వేను కుట్ర పూరితంగా మార్చారని మండిపడ్డారు.

**ప్రజల నుంచి వస్తున్న రీ సర్వే డిమాండ్ వేరు..**

ప్రజల నుంచి వస్తున్న రీ సర్వే డిమాండ్ వేరు.. ప్రభుత్వం చేస్తున్నది వేరన్నారు. సర్వేలు దేశవ్యాప్తంగా ఎన్నో జరిగాయని.. విఫలమైందని మాత్రం రేవంత్ ప్రభుత్వ సర్వే మాత్రమేనన్నారు. ఎదో మళ్లీ నాలుగు పేజీలు జోడించి.. మమ అనే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. మొదటి నుంచి తప్పులు ఎత్తి చూపే ప్రయత్నం చేసినా.. ప్రభుత్వం సరిచేసుకోలేదని విమర్శించారు. డేడికేటెడ్ కమిషన్‌ను నిపుణులతో ఏర్పాటు చేసి రీ సర్వే చేయాలని.. అప్పుడే చట్టబద్ధత వస్తుందన్నారు. డేడికేటెడ్ కమిషన్ స్వతంత్రంగా వ్యవహరించి రీ సర్వే చేస్తేనే న్యాయ స్థానాల్లో నిలబడుతుందని తెలిపారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే అసెంబ్లీ ఒక్క రోజు సమావేశాన్ని ఏర్పాటు చేశారని.. ఆ రోజు బీసీ రిజర్వేషన్లపై చట్టం చేస్తారనుకుంటే చేయలేదన్నారు. ఇప్పుడు చట్టబద్ధతపై మాట్లాడుతున్నారని మండిపడ్డారు. స్థానిక ఎన్నికల గురించి నిన్న సీఎం నేతృత్వంలోని మీటింగ్ పెట్టారని, అందులో కాంగ్రెస్ విజయావకాశాలను సర్వే రిపోర్టుల ఆధారంగా చర్చించారన్నారు.

**సర్వేల్లో కాంగ్రెస్‌కు చావుదెబ్బ తప్పదని తేలింది..**

సర్వేల్లో కాంగ్రెస్‌కు చావు దెబ్బ తప్పదని వచ్చిందని.. అందుకే స్థానిక ఎన్నికలను వాయిదా వేశారని విమర్శించారు. సర్వేలో 70 రకాల ప్రశ్నలు చేశారని.. అందుకే ప్రజల్లో ఉత్సాహంగా పాల్గొనలేదన్నారు. సరళమైన ప్రశ్నావళిని రూపొందించి రీ సర్వే చేయాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ హయంలో నిర్వహించిన సమగ్ర సర్వేలో ప్రజలందరూ పాల్గొనాలని.. కామారెడ్డి డిక్లరేషన్‌ను కాంగ్రెస్ తుంగలో తొక్కిందని.. అందులో ఏ హామీపై రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. అఖిల పక్ష సమావేశం ఎప్పుడో నిర్వహించాల్సిందని.. రేవంత్ ప్రభుత్వం లీకులు, సాకులు, ఫేక్‌ల ప్రభుత్వంగా మారిందని ఎద్దేవా చేశారు. రాహుల్ గాంధీ.. రేవంత్ రెడ్డిని నమ్మే పరిస్థితి లేదన్నారు. రేవంత్ ప్రభుత్వం కులగణన సరిగా చేయలేదని, రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదనే రాహుల్ తెలంగాణకు మొహం చాటేశారన్నారు. ప్రజల్లో ఆగ్రహాన్ని చూసే రాహుల్ వరంగల్ టూర్‌ను రద్దు చేసుకున్నారని, కేసీఆర్, కేటీఆర్‌ల వివరాలన్నీ ఎన్నికల అఫిడవిట్లలో ఉన్నాయని.. కేవలం సర్వే ద్వారా వివరాలు తెలుస్తాయనడం కాంగ్రెస్ నేతల మూర?త్వమన్నారు.

# పాతికేళ్ల ప్రస్థానం.. ఫిబ్రవరి 19న భారాస విస్తృతస్థాయి సమావేశం

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: పాతికేళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంటున్న వేళ రజతోత్సవ వేడుకల నిర్వహణతో పాటు పార్టీ నిర్మాణం, భవిష్యత్ కార్యాచరణపై చర్చించేందుకు భారత రాష్ట్ర సమితి సిద్ధమైంది. ఈ మేరకు పార్టీ విస్తృతస్థాయి కార్యవర్గం ఈ నెల 19న సమావేశం కావాలని.. అధినేత కేసీఆర్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు ఆదేశాలు జారీ చేశారు.

ఫిబ్రవరి 19న తెలంగాణభవన్‌లో మధ్యాహ్నం ఒంటి గంటకు సమావేశం జరగనుంది. కేసీఆర్ అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గం, జిల్లా అధ్యక్షులు, ప్రస్తుత, మాజీ ఎంపీలు.. ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ ఛైర్మన్లు, జడ్పీ ఛైర్మన్లు, డీసీసీబీ, డీసీఎంఎస్ అధ్యక్షులు, పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు పాల్గొననున్నారు.

"రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు, ప్రభుత్వ వైఫల్యాల మీద ప్రధానంగా చర్చిస్తాం. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు అనుగుణంగా భారాస శ్రేణులు చేపట్టాల్సిన కార్యాచరణపై సమగ్ర చర్చ ఉంటుంది. ప్రభుత్వం ఇచ్చిన హామీల సాధన, హక్కులను కాపాడుకునే దిశగా రాష్ట్ర ప్రజలను చైతన్యం చేసేందుకు పార్టీ



నాయకత్వం, కార్యకర్తలు, శ్రేణులు అనుసరించాల్సిన వ్యూహాలు, విధానాలపై సమావేశంలో చర్చిస్తాం"అని కేటీఆర్ తెలిపారు.

## లోక్‌సభలో కొత్త ఇన్‌కమ్ ట్యాక్స్ బిల్లు: మార్పులు, చేర్పులు ఇవే

మొదటిపేజీ తరువాయి

1961 ఆదాయ పన్ను చట్టంలోని కఠిన నిబంధనలు, పదాలు, వివరణల్ని సరళతరం చేస్తూ ఈ బిల్లును తీసుకొచ్చామని ఆర్థిక మంత్రి వివరించారు. బిల్లును లోక్‌సభ సెలెక్ట్ కమిటీకి సూచించాలని ఆమె లోక్‌సభ స్పీకర్‌ను కోరారు.

ప్రస్తుతం అమలులో ఉన్న దశాబ్దాల నాటి ఆదాయపు పన్ను చట్టం స్థానంలో కేంద్రం కొత్త చట్టాన్ని తీసుకొచ్చింది. కొత్త చట్టం ఏప్రిల్ 1, 2026 నుండి అమల్లోకి రానుంది.

**కొత్త ఇన్‌కమ్ ట్యాక్స్ బిల్లు మార్పులు, చేర్పులు ఇవే..**

కొత్త ఆదాయపు పన్ను బిల్లు(2025) భాషను సులభతరం చేస్తుంది. అంటే సరళతరమైన భాష, చిన్నచిన్న వాక్య నిర్మాణాలు, అనవసరమైన నిబంధనలు తొలగించారు.

ఈ బిల్లు ఎటువంటి కొత్త పన్నులు విధించదు. 1961 ఆదాయపు పన్ను చట్టంలో ఉన్న పన్నులే ఉంటాయి.

1961 ఐటీ చట్టంలో 298 సెక్షన్లు, 23 చాప్టర్లు, 14 షెడ్యూల్‌లు ఉండగా.. కొత్త చట్టంలో 536 సెక్షన్లు, 23 చాప్టర్లు, 16 షెడ్యూల్‌లు ఉన్నాయి. మొత్తం 622 పేజీలు. మునుపటితో పోల్చితే కొత్తదాంట్లో సెక్షన్లు, షెడ్యూళ్లను పెంచారు.

కొత్త చట్టం 2026 ఏప్రిల్ 1 నుండి అమల్లోకి రానుంది. చట్టం నోటిఫై చేయబడిన తర్వాత నియమ నిబంధనలు అమల్లోకి వస్తాయి.

ప్రస్తుతం ఏప్రిల్ 1 నుంచి మార్చి 31 వరకు అసెస్‌మెంట్ ఇయర్ అని పిలుస్తుండగా.. కొత్త బిల్లులో ట్యాక్స్ ఇయర్‌గా మార్చారు. అంటే మునుపటి సంవత్సరం', 'అంచనా సంవత్సరం వంటి కష్టమైన పదాలను కొత్త బిల్లులో తొలగించి.. 'పన్ను సంవత్సరం' అనే ఒక్క పదంతో సరిపెట్టారు.

ప్రస్తుత చట్టంలో చాలాసార్లు కనిపించే 'నాట్‌విత్‌స్టాండింగ్' పదం స్థానంలో 'ఇర్రెస్పెక్టివ్' పదాన్ని చేర్చారు.

పన్ను చెల్లింపుదారుల హక్కులు, బాధ్యతలు వివరించే పన్ను చెల్లింపుదారుల చార్టర్‌ను బిల్లులో చేర్చారు.

సాధారణ పన్ను చెల్లింపుదారులూ చదవడానికి వీలుగా టేబుల్స్, ఫార్ములాలు పొందుపరిచారు.

జీతాల్లో స్టాండర్డ్ డిడక్షన్, గ్రాట్యుటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ వంటి తగ్గింపులన్నీ ఒకే చోట. మునుపు వివిధ సెక్షన్లు, రకరకాల నిబంధనల్లో ఇవి ఉండేవి.

వ్యక్తులు, హిందూ అవిభాజ్య కుటుంబాలు (హెచ్‌యూఎఫ్), ఇతరుల కోసం కొత్త, పాత ఆదాయ పన్ను విధానాలకు వర్తించేలా చట్టం.

మార్కెట్ ఆధారిత డిబెంచర్లలో మూలధన లాభాల కంప్యూటేషన్ కోసం ప్రత్యేక ప్రొవిజన్లు.

## భారాస అగ్ర నేతలు సర్వేలో పాల్గొని చిత్తశుద్ధి నిరూపించుకోవాలి

మొదటిపేజీ తరువాయి

కరీంనగర్: తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వే రాష్ట్రాలన్నింటికీ మార్గదర్శకంగా నిలిచిందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కొంత మంది సర్వేలో పాల్గొనకుండా తమ సమాచారాన్ని ఇవ్వకపోవడంతో ఫిబ్రవరి 28 వరకు గడువు పొడిగించినట్లు చెప్పారు. భారాస నేతలు చెబుతున్నట్లు ఇది రీసర్వే కాదని పొన్నం స్పష్టం చేశారు. సర్వేలో పాల్గొనని భారాస నేతలు అనవసర ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజాస్వామ్యం మీద విశ్వాసం ఉంటే భారాస అగ్ర నేతలు సర్వేలో పాల్గొని తమ చిత్తశుద్ధి నిరూపించుకోవాలన్నారు. కరీంనగర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు.

"భాజపా వ్యాపారులస్తుల అనుకూల పార్టీ. కులగణన, బీసీ, ఎస్సీ వర్గీకరణ ఆ పార్టీకి ఇష్టం లేదు. ప్రజల అకాంక్షలకి అనుగుణంగా తెలంగాణలోనూ రిజర్వేషన్లు అమలు చేయాలి. సర్వే పూర్తయిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయి. సామాజిక మార్పు కలిగించే నిర్ణయం ఇది. రాజకీయ విమర్శల కొసమే భాజపా నేతలు బీసీలు, ముస్లింలపై విమర్శలు చేస్తున్నారు. ముస్లిం కమ్యూనిటీలోని పేద ముస్లింలు బీసీలోనే కొనసాగుతున్నారు. బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించడంపై ప్రత్యేకంగా సమావేశం నిర్వహిస్తాం. బలహీన వర్గాలపై చిత్తశుద్ధి ఉంటే శాసనసభలో బిల్లును అడ్డుకోవద్దు" అని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.

## రూ.2కోట్ల విలువైన బంగారం, వజ్రాలు చోరీ.. ముగ్గురి అరెస్ట్

మొదటిపేజీ తరువాయి

ఈ కేసు వివరాలను కమిషనర్ సీవీ ఆనంద్ మీడియాకు వివరించారు. "హిమాయత్‌నగర్ మినర్వా హోటల్ గల్లీలోని ఓ ఇంట్లోకి చొరబడిన నిందితులు సుమారు రూ. 2కోట్ల విలువైన



బంగారం, వజ్రాలు చోరీ చేశారు. ఇంటి యజమాని అభయ్‌కెడియా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నాం. వీరంతా కరడుగట్టిన నేరస్థులు. కేసు దర్యాప్తు కొనసాగుతోంది"అని సీవీ ఆనంద్ చెప్పారు.

# కులగణన..కాంగ్రెస్ గుణగణన

**శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్**

మొట్టమొదటి సారిగా బ్రిటిష్ ప్రభుత్వం 1881 సం.లోఈ కులగణన జరిపింది.దేశ ప్రజల్లో విభజన తేవడానికి, ప్రజల ఐక్యత దెబ్బతీయడం ఈ సర్వే ఉద్దేశ్యం.మన భారత దేశం స్వాతంత్రం సాధించిన తర్వాత 1951 లో కుల గణన జరిగింది.ఆంగ్లేయుల కుట్ర ఫలించింది.కుల గణన లో ఎస్సి,ఎస్టీలతో పాటు బిసిల జనగణన జరిగింది.విచిత్రం ఏమిటంటే బిసిల జనాభా గతం కంటే తగ్గింది. అగ్రవర్ణాల జనాభా రేటు పెరిగింది.ఇంకొక ప్రపంచ వింత జరిగింది.అదేమిటంటే తెలంగాణాలో క్రైస్తవులు లేరు.

మతం మారిన దళిత క్రైస్తవులు తమ మత గుర్తింపును దాచిపెట్టి ఇంకా తాము దళితులమేనని ప్రకటించుకోవడం ఒక వింత.ఇలా బిసిల జనాభా తగ్గడం లేదా తగ్గించి చూపడం ఒక కుట్ర అయితే, మతం మారిన దళితులు, చదువుల్లో ఉద్యోగాల్లో ప్రయోజనం పొందిన వారు తమను తాము దళితులమని సర్వేలో నమోదు చేసుకోవడం దళిత సామాజిక వర్గానికి దెబ్బ.ఇలా అగ్రవర్ణ జనాభా పెరిగి, దళితులకు పోటీ పెరిగి బిసిల జనాభా తగ్గడంతో ఒక పెద్ద కుట్ర దాగి ఉందని అన్ని రాజకీయ పార్టీలు,అన్ని బిసి కులాల సంఘాలు ప్రభుత్వ సర్వేను విమర్శిస్తున్నాయి.మొత్తంగా మెజారిటీ కులాల జనాభా ఇప్పుడు ఈ సర్వేను వ్యతిరేకిస్తున్నారు.మాజీ మంత్రి జోగు రామన్న, బిజెపి ఎంపీ డాక్టర్ లక్ష్మణ్ గారితో పాటు లెక్కలేనంత మంది ఈ కులగణనను వ్యతిరేకిస్తున్నారు.ఈ విమర్శ కేవలం నాయకుల వరకే కాదు, క్రింది స్థాయిలో కూడా కాంగ్రెస్ పట్ల తీవ్ర వ్యతిరేకత ప్రభలింది.

## కులగణన కాదు ఇది కాంగ్రెస్ గుణగణన




తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చేపట్టిన కులగణన వివాదాస్పదం అయింది.ఎన్నికల వేళ వరంగల్ సభలో రాహుల్ గాంధీ ప్రకటించిన రైతు డిక్లేరేషన్, కామారెడ్డిలో ప్రకటించిన కులగణన డిక్లేరేషన్ ఇప్పుడు కాంగ్రెస్ మెడకు చుట్టుకున్నది.దివాలా తీసిన రాష్ట్ర ఆర్థిక స్థితిని దారిలో పెట్టడం రేవంత్ సర్కారుకు ఒక సవాలుగా మారింది.అదే సమయంలో వివిధ సంక్షేమ పథకాలు అమలు కూడా మరో సవాల్ గా మారింది.ఇదిలా ఉంటే రాహుల్ గాంధీ దేశ వ్యాప్తంగా కుల గణన అంటూ తిరగడం, ఆ డిమాండ్ ను సాకారం చెయ్యడానికి కాంగ్రెస్ ఉన్న మూడు రాష్ట్ర ప్రభుత్వాలు కసరత్తులు చేస్తున్నాయి.కర్నాటక కాంగ్రెస్ ప్రభుత్వం కుల గణన చేసి ఆ నివేదిక బయట పెట్టడానికి జంకుతున్నది.తెలంగాణలో రేవంత్ సర్కార్ హడావుడిగా కులగణన సర్వే జరిపి విమర్శలు ఎదుర్కొంటున్నది.కుల గణన సర్వే రిపోర్ట్ రాష్ట్ర అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన కాంగ్రెస్ ఇప్పుడు నాలుక కరచుకుంటున్నది.అసెంబ్లీ సాక్షిగా ఈ రిపోర్టును ప్రతిపక్ష సభ్యులు వ్యతిరేకించారు. ఇది అసమగ్ర సర్వే అంటూ శాసన సభ్యులు తీవ్ర విమర్శ చేసారు.ఈ సర్వేను మళ్ళీ చేపడతామని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించడంతో ప్రభుత్వం అభాసు పాలయ్యింది.ఈ సర్వే ఒక చిత్తు కాగితమని బిఆర్ఎస్ నాయకుడు శాసన సభ్యుడు కేటీఆర్ విమర్శించారు.రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ముస్లిం బిసి లంటూ ఒక కొత్త గణాంకం ప్రకటించడం వివాదంగా మారింది.బిజెపి ఎమ్మెల్యేలు శాసన సభ లోపల,బయట ఈ కొత్త లెక్కను తూర్పార బట్టారు.ఇది న్యాయ పరిశీలనకు నిలబడని గణాంకమని బిజెపి ఎమ్మెల్యే పాయల్ శంకర్ విమర్శించారు.తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 50 రోజుల పాటు కుల గణన సర్వే నిర్వహించింది.ప్లానింగ్ కమిషన్ రూపొందించిన ఈ సర్వే నివేదికకు కేబినెట్ ఆమోదం తో పాటు అసెంబ్లీ కూడా ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే.

దీంతో కుల గణన సర్వే నివేదిక తెలంగాణ రాష్ట్రంలో అధికారిక రూపుదాల్చింది. దీంతో ప్రస్తుతం రాష్ట్రంలో ఈ కులగణన హాట్ టాపిక్‌గా మారింది. బీసీలను తగ్గించే ప్రయత్నం చేశారని వివిధ కుల సంఘాలు తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తున్నారు.

ఈ సర్వే లో ఓబీసీల సంఖ్య పెరగడం, బీసీల సంఖ్య తగ్గడం ఒక మాయ అంటూ సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి.ఈ సర్వే బిల్లును కేంద్ర ప్రభుత్వ ఆమోదానికి పంపుతామని రాష్ట్ర కాంగ్రెస్ అంటున్నది. ఇది బిసి కుల, హిందూ మత వ్యతిరేక సర్వే ఇప్పుడు ఇదే అభిప్రాయం అంతటా షికారు చేస్తున్నది.ఉచితాలు ప్రకటించి అమలు చేయడంలో తడబడుతున్న కాంగ్రెస్ ను సామాన్య ప్రజలు తిట్టుకుంటున్నారు.పాత పెన్షన్లు రాక, కొత్త పెన్షన్లు లేక అర్హులు తల్లడిల్లుతున్నారు. దీనితో తెలంగాణ వ్యాప్తంగా కాంగ్రెస్ అపవాదులను ఎదుర్కొంటున్నది

## ఉచిత పథకాలు గుదిబండ !

ప్రజలను ఉచితాలకు అలవాటు చెయ్యడం కంటే ఉపాధి వైపు తీసుకు పోవాలని స్వయానా సుప్రీం కోర్టు మొన్న ఒక రూలింగ్ ఇచ్చింది.ప్రజలు ఒకప్పుడు గ్రామానికి కావాల్సిన సౌకర్యాలు కోరేవారు. ఈ ఉచిత పథకాల వల్ల ఇప్పుడు వ్యక్తిగత కోరికలు కోరుతున్నారని ఉమ్మడి రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్యమంత్రి దివంగత నేదురుమల్లి జనార్ధనరెడ్డి గారు ఎప్పుడో తన అభిప్రాయాన్ని బహిరంగంగా ప్రకటించిన వీడియో ఇప్పుడు తెగ సర్క్యులేషన్ అవుతున్నది.ఈ ప్రభుత్వాలు అప్పులు చేసి దేశాన్ని ప్రజలను తాకట్టులో పెడుతున్నారని వాపోయిన పెద్దల మాట వినేవారు లేరు.ఎన్నికల్లో గెలవడం,అధికారం సాధించడం మాత్రమే రాజకీయ పార్టీల కార్యక్రమంగా మారింది. ప్రజలు కూడా ఈ ఉచితాలకు అలవాటు పడ్డారు.యధారాజ తథా ప్రజ.. పాలకుల మాదిరిగానే ప్రజలు మసలుకుంటారు. ఈ ఉచిత పథకాల సంతర్పణ ఆగేదెప్పుడు ? ఆర్థిక స్థితి కుదుట పడేదెప్పుడు ? తాకట్టులో భారతదేశం' అనే పుస్తకాన్ని వామపక్ష అతివాది తరిమెల నాగిరెడ్డి నాలుగున్నర దశాబ్దాల క్రితమే రాశారు. సిద్ధాంతాల ప్రాతిపదికన ఆయన అప్పట్లో 'ఇండియా మార్ట్‌గేజ్డ్' పేరిట ఇంగ్లీషులో ఈ పుస్తకం రాశారు.ఆ మహానుభావుడి ఉపదేశాలు పుస్తకంలో బంధీ చేసిన రాజకీయ పార్టీలు పులిపై సవారీ చేస్తున్నాయి. ఇప్పుడు ఉచిత పథకాలు ఉపసంహరిస్తే ప్రజలు తమ ప్రభుత్వాలను సంహరించే ప్రమాదం ఉందని ఒకరిని మించి మరొకరు ఉచిత పందేరంలో దూసుకుపోతున్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ కులగణనతో తన గుణగణన చాటుకున్నదని విమర్శకుల అభిప్రాయం.ఈ కులగణన అనే ఊబిలో చిక్కుకుని పెనుగులాడుతున్న విషయం స్పష్టంగా కనిపిస్తున్నది.బిసిల రిజర్వేషన్ల ఫైల్ కేంద్రానికి పంపామని, కేంద్రం గనుక ఆమోధించకపోతే నెపం కేంద్రం పై తోసి తప్పించుకోవడం తప్ప మార్గం లేదు.ఎస్సీ ఎస్టీ వర్గీకరణ,బిసి రిజర్వేషన్ల రగడ తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ కు ఒక కఠిన పరీక్ష అన్నది మాత్రం నిజం.ఈ కులగణనతో ఇప్పుడు ప్రజలు కాంగ్రెస్ గుణగణన చేస్తున్నారు.

# ఎన్నికలొస్తున్నాయ్

# ఇక నాగా సాధువులొస్తారు

**ఆకుల రంజిత్, కరపత్రం ప్రతినిధి**

కుంభమేళా చూస్తున్నారుగా..కుంభమేళా పవిత్ర స్నానాలు చెయ్యడానికి నాగా సాధువులు బిల బిల మంటూ రావడం మనం చూస్తున్నాము. ఆ సాధువులు ఎక్కడి నుండి వస్తారో, స్నానం చేసిన తర్వాత ఆ నాగా సాధువులు ఎక్కడికి వెళతారో ఎవ్వరికీ తెలియదు.వారి అడ్రస్ గాని, వారి నివాసాలు గాని మనకు తెలియదు.అలాగే అవకాశవాద నాగాలు, గెలిచే పార్టీల బలం చూసి వచ్చి, పోతుంటారు తెలంగాణాలో పంచాయతీ రాజ్ ఎన్నికలు, మున్సిపల్ ఎన్నికలు రాబోతున్నాయి. ఇక రాజకీయ వలస వాదులు ఈ నాగా సాధువుల మాదిరిగా వస్తారు. వెళతారు..కార్యకర్తలు మాత్రం గంగా నదిలా నిరంతరం ప్రవహిస్తూనే అంటారు. పార్టీ కొరకు పని చేస్తూనే వుంటారు. కౌన్సిలర్లుగా, ఎంపీటీసీ, సర్పంచ్, జెడ్పీటీసీ, మున్సిపల్ చైర్మన్ లుగా పోటీ చేయాలనుకుంటున్న వారు ఇక పార్టీల పవిత్ర స్నానాలు చెయ్యడానికి నాగా సాధువుల వలె వస్తారు. మొన్న రద్దయిన కోరుట్ల మున్సిపల్ లో తాజా మాజీ కౌన్సిలర్లు ఏ పార్టీలో గెలిచి ఏ పార్టీ కౌన్సిలర్లుగా



అవతారం చాలించారో అందరికీ తెలుసు.ప్రతి పార్టీలో కార్యకర్తలు అంకిత భావంతో పని చేస్తారు. తమ పార్టీలో గెలిచి వ్యతిరేక పార్టీలో చేరడం చూసి కార్యకర్తలు మౌనంగా ఈ పరిణామాలను భరిస్తున్నారు.వ్యతిరేక పార్టీలో గెలిచి ఇప్పుడు తమ పార్టీలో చేరిన వారిని చూసి కార్యకర్తలు కోపంతో రగిలిపోతున్నారు.12 సం.లకు ఒకసారి కుంభమేళా పుష్కరాలు వచ్చినట్టు, ఐదు సం.లకు ఒకసారి ఎన్నికల మేళా వస్తుంది.కుంభమేళాకు నాగాలు వచ్చిపోయినట్టు, ఎన్నికల మేళాకు ఈ వలస జీవులు వచ్చిపోతారు.ఏ పార్టీ అధికారంలో అంటే ఆ పార్టీ గంగలో మునిగి పోతుంటారు.ఈ వలస జీవులు ఎన్నాళ్ళు వారి పార్టీలో ఉంటారో, ఎప్పుడు వెళ్ళిపోతారో తెలియక నిజమైన కార్యకర్తలు వేదన చెందుతున్నారు.ఈ అవకాశ వాదులను దెబ్బతీయడానికి ఎదురు చూస్తున్నారు.ఒక్క కోరుట్ల లోనే కాదు, మెటుపల్లితో సహా రాష్ట్ర వ్యాప్తంగా ఈ నాగా సాధువుల అతిథి నాయకత్వ పాత్రను చూసి కసితో రగులుతున్నారు.కోరుట్లలో నిన్న రద్దయిన మున్సిపల్ కౌన్సిల్ లో తాజా మాజీల చరిత్ర అందరికీ తెలుసు.ఎన్నికల షెడ్యూల్ రాబోతున్నది కాబట్టి, ఇక ఈ రాజకీయ నాగా సాధువులు పార్టీల పవిత్ర స్నానాలకు వస్తారు.ఈ రాజకీయ నాగాలను తమ పార్టీ జలాల్లో మంచి శాశ్వత మోక్షం కలిగించాలని అన్ని పార్టీల కార్యకర్తలు సిద్ధమవుతున్నారు.రాబోయే మున్సిపల్ ఎన్నికలు,పంచాయతీ రాజ్ ఎన్నికలు రసవత్తరంగా ఉండబోతున్నాయి.డబ్బు తీసుకుని పార్టీ టికెట్లు ఇచ్చే నాయకులకు చుక్కలు చూపించబోతున్నారు.పార్టీ టిక్కెట్లు కొనుక్కుని పోటీ చేసే నాగా అభ్యర్థులకు కార్యకర్తలు పాతాళం చూపించబోతున్నారు.పార్టీ జెండాలు మోసే కార్యకర్తల మనోభావాలు దెబ్బతీసే రాజకీయ నాయకత్వాలు జాగ్రత్తగా ఉండాల్సిందే..

# ప్రతి మొక్క సంరక్షణ చేపట్టాలి....

- నర్సరీలో మొక్కల ఎదుగుదలకు ప్రత్యేక చర్యలు...
- నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు....
- డి ఆర్ డి ఓ పి డి శ్రీధర్....

**కరపత్రం శంకరపట్నం ఫిబ్రవరి 13**



ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు నర్సరీలలో ప్రతి మొక్క సంరక్షణ చేపట్టి మొక్కల ఎదుగుదలకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఈజీఎస్ సిబ్బందిని డి ఆర్ డి ఓ పిడి శ్రీధర్ ఆదేశించారు. బుధవారం కరీంనగర్ జిల్లా మానకొండూరు నియోజకవర్గం శంకరపట్నం మండలంలోని తాడికల్ వెంకయ్యగడెం గ్రామాల్లో గల మొక్కల పెంపకం కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి మొక్కల పెంపకం కోసం సిబ్బందికి పలు సూచనలు చేశారు. మొక్కలను సంరక్షణ చేసి, మొక్కలు నాటేందుకు మొక్కలను నర్సరీల ద్వారా ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు పంపిణీ చేయాలని ప్రతి నర్సరీలో మొక్కల పెంపకం ప్రత్యేకంగా చేపట్టి కాలుష్య నివారణకు మొక్కలను నాటే అందుకు సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు నిర్లక్ష్యం చేస్తే శాఖ పరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఈజిఎస్ ఏపీవో కే శారద, ఫీల్ అసిస్టెంట్లుమొలుగూరి సత్యనారాయణ, సిబ్బంది తదితరులు ఉన్నారు.

# ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తో ఎద్దు మృతి..

- బోరున విలపించిన దాట్ల మల్లయ్య..

**కరపత్రం ప్రతినిధి,వీణవంక, ఫిబ్రవరి 13.**

వీణవంక మండలం కొండపాక గ్రామంలో మానేరు పరిసర పంట పొలాల సమీపాన ఉన్న ట్రాన్స్ఫార్మర్ వద్ద ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ గురై, అదే గ్రామానికి చెందిన దాట్ల మల్లయ్య ఎద్దు మృత్యువాత పడడం, గ్రామస్తులను తీవ్రంగా కలిచివేసింది. గ్రామస్తులు మాట్లాడుతూ... ట్రాన్స్ఫార్మర్ కు కంచే లేకపోవడం వల్లే, ఎద్దు మేస్తూ ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ గురై, చనిపోవడం జరిగిందని, ఎద్దు విలువ సుమారుగా రూ 75,000 ఉంటుందని, రాష్ట్ర ప్రభుత్వం నష్టపోయిన పాడి రైతును ఆర్థికంగా ఆదుకోవాలని, గ్రామస్తులు ఆవేదన వ్యక్తపరిచారు.

# తెలంగాణ బంద్ ని విజయవంతం చేద్దాం

**ఆకుల రంజిత్, కరపత్రం ప్రతినిధి**

ఎస్సీ వర్గీకరణ పేరుతో మాలలకు జరిగే అన్యాయాన్ని ప్రశ్నిస్తూ రాష్ట్ర మాల సంఘం ఫిబ్రవరి 14న రాష్ట్ర బంద్ పిలుపుమేరకు మండల ప్రజలంతా రాష్ట్రబంద్ కి సహకరించాలని ఇబ్రహీంపట్నం మండల మాలసంఘం అధ్యక్షుడు దేవానందంగారు కోరారు...రిజర్వేషన్ల ద్వారా మాలలు మాదిగలకంటే ఎక్కువగా లాభపడ్డారని, గుంజుకుతింటున్నారని మాపై నిందలువేసిన మందకృష్ణ మాదిగ.మమ్మల్ని నిందించే వాళ్లసంఘంవారు అది నిజమని నిరూపిస్తే వాళ్లకు మారాష్ట్ర నాయకత్వం 25 లక్షల రూపాయల నజరానా ప్రకటించిన విషయం తెలిసిందే.

దానికి మేముకూడా కట్టుబడిఉన్నామని తెలుపుతూ కేవలం ఎస్సీ వర్గీకరణ పేరుతో మందకృష్ణ తన



రాజకీయ స్వార్థ ప్రయోజనాల కోసం అన్నదమ్ముల లాగా కలిసున్న రెండువర్గాల మధ్య చిచ్చుపెట్టి స్వలాభం పొందుతున్నాడని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ పేరుతో ఎస్సీలలో ఉన్న ఇతర ఉపకులాలకు తీవ్ర నష్టం కలుగుతుందని తెలుపుతూ రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయానికి నిరసనగా మాల సంఘాల తరపున రాష్ట్ర బంద్ కార్యక్రమానికి పిలుపునిస్తున్నామని మండల ప్రజలంతా దీనికి సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు కారం ఇంద్రయ్య,రాష్ట్రనాయకులు గుజ్జరి ప్రకాష్, రవి, దూదిగాం గంగాధర్, బొల్లం మురళి,బోరిగం మహేష్, లక్కం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# స్వగ్రామంలో నూతన వధూవరులను ఆశీర్వదించిన కోమ్మిడి రాకేష్ రెడ్డి..

**కరపత్రం ప్రతినిధి, వీణవంక, ఫిబ్రవరి 13.**

వీణవంక మండలం నర్సింగాపూర్ గ్రామంలో గురువారం జరిగిన పల్లెపు రమేష్ కుమార్తె వివాహానికి, అతిథి డెవలపర్స్ అధినేత, కాంగ్రెస్ యువ నాయకులు కొమ్మిడి రాకేష్ రెడ్డి హాజరై, నూతన వధూవరులను ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ శ్రీపతి రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు కొండల్ రెడ్డి, ముద్దం తిరుపతి, సతీష్ కుమార్, విద్యాసాగర్, మద్దుల ప్రశాంత్, రాంగోపాల్ రెడ్డి, బీరయ్య, గణేష్, శ్రావణ్, కుటుంబ సభ్యులు, బంధువులు తదితరులు పాల్గొన్నారు.

# వాలెంటైన్స్ డే రోజు దేశ సైనికులను ప్రేమించుదాం


**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**

ఫిబ్రవరి 14 వాలెంటైన్స్ డే..
ప్రపంచం జరుపుకునే "వాలెంటైన్స్ డే" నైతికత లోపించిన రోజుగా మారింది.తల్లిదండ్రుల ఆజమాయిషీ లేని పిల్లలు పార్కుల్లో రూముల్లో చాటుమాటుగా కలిసి అసభ్య పనులు చెయ్యడానికి వేడుకగా మారింది.వాలెంటైన్స్ డే నిజంగా ప్రేమికుల రోజు అని భావిస్తే జీసస్ మాదిరిగా అభాగ్యులను, బుద్ధుని మాదిరిగా జ్ఞానులను ప్రేమించాలి.ప్రేమతో మానవత్వాన్ని పెంపొందించాలి. వాలెంటైన్స్ డే సాకుతో అసభ్య పనులు చెయ్యడం వాలెంటైన్స్ డే ఉద్దేశ్యం కాదు.ఒక అమ్మాయి, ఒక అబ్బాయి మధ్యన అవాంచనీయ శృంగార పనులకు వాలెంటైన్స్ డే ఉపయోగపడకూడదు.

### కామ వికారాల ప్రదర్శన వాలెంటైన్స్ డే కాదు

పరిపక్వత లేని వయస్సులో పుట్టే కామ కోరికలు సమర్థనీయం కాదు.ఇది నిజమో కాదో..మీ తల్లిదండ్రులను అడగండి.ఒక వేళ నిజమైతే ..మీ పిల్లలను ఊరి మీద వదలండి.విచ్చలవిడితనం ప్రేమ అని నేర్పండి.మన హృదయానికి నచ్చని ఈ కామ వికార వేడుక వాలెంటైన్స్ డే.ఇది సభ్యత కాదు. సంస్కారం కాదు.మన సంస్కృతి కాదు.పరిపూర్ణ ప్రేమకు, భాధ్యత నేర్పే రోజు వాలెంటైన్స్ డే..




### 2019 ఫిబ్రవరి 14 రోంజు మీకు జ్ఞాపకం ఉందా?

ఆరోజు మన దేశ రక్షకులు అయిన భారత సైనికులు పుల్వామా లో బలి అయిన రోజు.2019 ఫిబ్రవరి 14న జమ్ము శ్రీనగర్ జాతీయ రహదారిలో భారతీయ సైనికులను తీసుకువెళ్తున్న వాహనాల కాన్వాయ్ మీద లేథిపురా ఏ అవంతిపురా సమీపంలో కారుతో ఆత్మాహుతి బాంబు దాడి జరిగింది.ఆ దాడి జరిగిన ప్రదేశం పుల్వామా..




ఈ దాడి కారణంగా 40 మంది సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ సిఆర్పీఎఫ్ సైనికులు, ఒక ఉగ్రవాది మరణించారు. పాకిస్తాన్ లో స్థావరం కలిగి భారత్ లో విచ్చిన్న కార్యకలాపాలు, ఉగ్రవాద కార్యకలాపాలు సాగిస్తున్న ఇస్లామిక్ ఉగ్రవాద సంస్థ జైష్-ఎ-మహమ్మద్ ఈ దాడికి కారణం. ఈ విషయం జేఈఎం ప్రకటించుకుంది. దాడిచేసినది కాశ్మీరీ అయిన ఆదిల్ అహ్మద్ దార్ అని గుర్తించారు.ఫిబ్రవరి 14 మన వీర సైనికుల బలిదానం జరిగిన రోజు..ఆ రోజున గుర్తుంచుకుందాం..ఈ దేశ రక్షకులను స్మరించుకుందాం..వారికి ప్రేమ పంచుదాం..వారి కుటుంబ సభ్యులకు మన ప్రేమ పంచుదాం..నిరంతరం మనల్ని,మన దేశాన్ని కంటికి రెప్పలా కాపాడుతున్న ప్రతి సైనికున్ని ప్రేమించుదాం.కని పెంచి కంటికి రెప్పలా కాపాడుతున్న కన్న వాళ్ళను ప్రేమించుదాం.విద్యా బుద్ధులు నేర్పిన గురువులను ప్రేమించుదాం..కష్టంలో తోడుండే సోదరులను ప్రేమించుదాం..ప్రేమను పంచే తోబుట్టువు సోదరిని ప్రేమించుదాం..జీవితాంతం నీడలా తోడుండే కట్టుకున్న వారిని ప్రేమించుదాం..నిద్రలో కూడా మన గురించి ఆలోచించే స్నేహితులను ప్రేమించుదాం..ప్రేమ కేవలం ఒక రోజు వేడుక కాదు..ప్రేమ ఒక సాధన, ఒక భోధన..నీటిలో నానని, నిప్పులో కాలని, గాలిలాగ మారని ప్రేమ సత్యం.ప్రేమ నిరంతరం ప్రవహించే గంగ..కామం ప్రేమ కాదు..ఫిబ్రవరి 14 దేశ సైనికులను ప్రేమించే రోజు..పుట్టిన నుండి చచ్చే దాకా నిన్ను మోసే ఈ నేల తల్లి భారతిని నిత్యం ప్రేమించడమే వాలెంటైన్స్ డే ఉద్దేశ్యం కావాలి.భారత్ మాతాకీ జై

## హీరో వెంకటేష్ అభిమానుల సంబరాలు

**కరపత్రం పెద్దపల్లి జిల్లా ప్రతినిధి:రామగుండం: ఫిబ్రవరి13**
పెద్దపల్లి జిల్లా గోదావరిఖని ఊర్వశి థియేటర్ లో హీరో విక్టరీ వెంకటేష్ నటించిన సంక్రాంతికి వస్తున్నాం సినిమా ఆంధ్ర ,తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 30 రోజులలో 300 కోట్ల రూపాయల కలెక్షన్లు చేసిన సందర్భంగా గోదావరిఖని ప్రాంత విక్టరీ వెంకటేష్ ఫ్యాన్స్ అధ్యక్షులు ఆలకుంట రాజేందర్ వారి సంఘం సభ్యులు ఫ్యాన్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు పాత పెల్లి ఎల్లయ్య, బాల రాజ్ కుమార్, విక్టరీ వెంకటేష్ ఫ్యాన్స్ సభ్యులు థియేటర్ మేనేజర్ ను,సిబ్బందిని మహమ్మద్ రఫీ, రాకమల్ల రామస్వామి, చిప్పకుర్తి రాజు, గరిగంటి కుమార్ ,సిద్ధూ, తల్వార్ , మేరీ, కిషోర్,పారుపెల్లి వెంకటేష్, జూపాక శ్రీకర్, పందిళ్ళ సంతోష్, సంజయ్, తాండే దుర్గే ,తాండే మాద, రమేష్, అనివేనా వేణు, శ్రావణ్, జడల రవి, రాంప్రసాద్, అందరి హీరోల అభిమాన సంఘల అధ్యక్షుల ను ఘనంగా సన్మానించి షీల్డ్స్ ను అందజేయడం జరిగింది.

## రేవంత్ రెడ్డి రాష్ట్రంలో ఉద్దేర బెరకాడిల మారారు

- రేవంత్ రెడ్డి రాహుల్ గాంధీ ఇద్దరు ఐరన్ లెగ్...
- ప్రభుత్వం రీసర్వే కాదు రీ ఎలక్షన్ నిర్వహించాలి...

బీఅర్ఎస్ పార్టీ అధ్యక్షులు జీవన్ రెడ్డి...

రేవంత్ రెడ్డి రాహుల్ గాంధీ ఇద్దరు ఐరన్ లెగ్ లని,రేవంత్ రెడ్డి ముప్పయి సార్లు డిల్లీ వెళ్లిన రాహుల్ గాంధీ అపాయింట్ ఇవ్వలేదని బీఅర్ఎస్ పార్టీ అధ్యక్షులు మాజీ ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి అన్నారు.గురువారం నగరంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ,ప్రభుత్వం అన్ని రీ సర్వేలు కాదు. రీ ఎలక్షన్ నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారన్నారు.ఇటీవల జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్ కు
గుండు సున్నా వచ్చిందని గుర్తు చేశారు. కేసీఆర్ సారు కావాలి.కేసీఆర్ సర్కారు రావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు.అన్నింటిలో రీసర్వే నిర్వహించే కాంగ్రెస్ ప్రభుత్వం రీ ఎలక్షన్ కూడా నిర్వహిస్తే బాగుంటుందని హితవు పలికారు.రాహుల్ గాంధీకి రేవంత్ మొహం చూడటం కూడా ఇష్టం లేదన్నారు.ఈ రాష్ట్రం లో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా టిఆర్ఎస్ పార్టీకి ప్రజలు పట్టం కడతారన్నారు.సుస్థిర పాలన కెసిఅర్ ఇస్తే, అస్థిర పాలన రేవంత్ రెడ్డి ఇస్తున్నారన్నారు.ముఖ్యమంత్రిని రాష్ట్రంలో ఉద్దేర బెరకాడని
ప్రజలు పిలుచుకుంటున్నారని, అన్ని పథకాలు కూడా ఇప్పుడు అప్పుడు అంటూ మభ్యపెడుతున్నారు అన్నారు. రుణమాఫీ, భరోసా ఇప్పుడు ఇస్తాం అప్పుడు ఇస్తామంటూ కాలయాపన చేస్తున్నారన్నారు.
బీఆర్ఎస్ హయంలో హామీలో లేని పథకాలు అమలుచేసి ప్రజలకు మేలు చేశామని,కాంగ్రెస్ మాత్రం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా నెరవేర్చడం

## ఎస్ సి వర్గీకరణ కు వ్యతిరేకంగా నేటి బంద్ ను విజయవంతం చేయండి.....

**- మాల మహానాడు అఫ్ ఇండియా అంతర్గాం యువజన విభాగం అధ్యక్షులు తీగుట్ల నవీన్:**

**కరపత్రం పెద్దపల్లి జిల్లా ప్రతినిధి: రామగుండం:ఫిబ్రవరి 13:**
ఎస్ సి వర్గీకరణ కు వ్యతిరేకంగా నేడు ఫిబ్రవరి 14 శుక్రవారం బంద్ ను విజయవంతం చేయలని, మాల మహానాడు అఫ్ ఇండియా అంతర్గాం యువజన విభాగం అధ్యక్షులు తీగుట్ల నవీన్ అన్నారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....చట్ట విరుద్ధంగా, కేవలం ఒక వర్గాన్ని సంతృప్తి పరిచే ఎస్సి వర్గీకరణ కు వ్యతిరేకం గా మాల మహానాడు అఫ్ ఇండియా ఫిబ్రవరి 14 న బంద్ కు పిలుపు ఇచ్చిందనీ, అందులో భాగంగా అంతర్గాం మండలం లోని విద్యా, వర్తక ,వ్యాపార కేంద్రాలు, అన్ని వర్గాలు కూడా బంద్ కు సహకరించాలని విజ్ఞప్తి చేస్తున్నామని, ఎస్సి ల ఐక్యత ను దెబ్బతీసే వర్గీకరణ ప్రజాస్వామ్య విరుద్ధమని,అందరం అన్నా తమ్ముళ్లు లా కలిసి పోరాడాలిసింది పోయి వారికే తొత్తు గా మారడం దళిత జాతికి ద్రోహం చేయడమే అని వారు అన్నారు.

## కీటక జనీత వ్యాధులపై డిఎంహెచ్ఓ సమీక్ష

**కరపత్రంనిజామాబాద్ టౌన్, ఫిబ్రవరి 13 :**
జిల్లా వైద్య ఆరోగ్య శాఖలోని కీటక జనిత వ్యాధుల నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో పని చేస్తున్న వివిధ పిహెచ్సి ల ల్యాబ్ టెక్నీషియన్లు,నోడల్ సూపర్వైజర్లు,సబ్ యూనిట్ అధికారులకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలోని సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించారు.ఈ సమావేశానికి హాజరైన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ బి.రాజశ్రీ మాట్లాడుతూ జిల్లా లో కీటక జనిత వ్యాధులు ముఖ్యంగా మలేరియా,ఫైలేరియా,డెంగ్యూ ప్రబలకుండా జాగ్రత్తలు వహించాలన్నారు.ల్యాబ్ టెక్నీషియన్లు మలేరియా,యాక్టివ్,పాసివ్ రక్తపూతల పరీక్షలను పెంచాలని,నోడల్ అధికారులు,ఏఎన్ఎం,ఆశా కార్యకర్తలు యాంటీ



లార్వెల్ స్ప్రే,ఫ్రైడే డ్రైడే,లార్వా నిల్వ ఉండే ప్రదేశాలను గుర్తించి వాటిని తొలగించాలన్నారు.ఆశా కార్యకర్తలు ఏఎన్ఎం రోజువారీ గృహ సందర్శనలో జర సర్వే తో పాటుగా కీటక జనిత వ్యాధులపై అవగాహన కలిగించాలని,బోదకాల వ్యాధికి రాత్రి నిర్వహించే లార్వా సర్వేను చేపట్టాలని, సెంటినల్ సర్వేలో భాగంగా ప్రతి టీం 300 స్లైడ్స్ చొప్పున మొత్తం 6000 స్లైడ్స్ సేకరించా లని తెలిపారు. జిల్లా ఉపవైద్యాధికారులు వారి వారి ఆర్మూరు,బోధన్,నిజామాబాద్ డివిజన్ల వారీగా వైద్యాధికారులు,ల్యాబ్ టెక్నీషియన్లు,పి హెచ్ సి నోడల్ అధికారులు,సబ్ యూనిట్ అధికారులకు సమీక్ష సమావేశాలు నిర్వహించి కీటక జనీత వ్యాధులు ప్రబలకుండా చూడాలన్నారు.ఏ ఇంటి వద్ద కూడా దోమల లార్వాలు కనిపించకుండా ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలన్నారు.ఇంకా ఈ కార్యక్రమంలో కీటక జనీత వ్యాధుల నియంత్రణ అధికారి డాక్టర్ తుకారం రాథోడ్,అసిస్టెంట్ మలేరియా అధికారి అబ్దుల్ సలీం,వివిధ మండలాల నుంచి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ ఆకస్మిక తనిఖీ...

- వైద్య సేవలపై ఆరా....
- సంతృప్తి వ్యక్తం చేసిన రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ రవీంద్ర నాయక్...

**కరపత్రం శంకరపట్నం ఫిబ్రవరి 13**
తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ హెల్త్ డైరెక్టర్ రవీంద్ర నాయక్ గురువారం కరీంనగర్ జిల్లాలో అకస్మికంగా తనిఖీ చేశారు. కరీంనగర్ జిల్లా మానకొండూరు నియోజకవర్గం శంకరపట్నం మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక వైద్య కేంద్రాన్ని క్షేత్రస్థాయిలో ఆకస్మికంగా తనిఖీ చేసి వైద్య సేవలపై ఆరా తీసి పలు సూచనలను రవీంద్ర నాయక్ చేశారు.





ప్రాథమిక మండల వైద్యాధికారి కొట్టే శ్రవణ్ కుమార్, సిబ్బంది అందిస్తున్న వైద్య సేవలకు సంతృప్తిని వ్యక్తం చేసి సిబ్బందికి అభినందనలు రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ రవీంద్ర నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య అధికారి వెంకటరమణ, హుజురాబాద్ డిప్యూటీ డిఎంహెచ్వో చందు, మండల వైద్య అధికారి గొట్టే శ్రావణ్ కుమార్, జిల్లా ప్రోగ్రాం అధికారి స్వామి తదితరులు ఉన్నారు.

## నాటిన ప్రతి మొక్కను కాపాడాలి.. ఏపీడి వామన్ రావు

**- ఉపాధి హామీ పథకం పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పనిసరి**

**కరపత్రం బాన్సువాడ ఫిబ్రవరి 13**
గ్రామాలలో ఉపాధి హామీ పథకం కింద నాటిన ప్రతి మొక్కను కాపాడే బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్, మేట్, పంచాయతీ కార్యదర్శులు బాధ్యతగా తీసుకొని ప్రభుత్వ ధనాన్ని వృధా కాకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఏపీడి వామన్ రావు అన్నారు. గురువారం బాన్సువాడ మండల అభివృద్ధి కార్యాలయంలో ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజా వేదిక చేపట్టారు. ఈ సందర్భంగా పలు గ్రామాలలో ఉపాధి హామీ పనుల వివరాలను సంబంధిత అధికారులు చదివి వినిపించారు. మొగులాన్ పల్లి గ్రామంలో జాబు కార్డు ఉపాధి కూలీలకు మెట్లు పని





కల్పించి వారి కుటుంబ సభ్యులకు హాజరు వేసినట్లు రుజువు కావడంతో మరోసారి కూడా పునరావృత్తం కాకుండా చూడాలన్నారు. ఉపాధి హామీ పనులను క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ జరపాలని, ఉపాధి హామీ కూలీలకు మాస్టర్లు కీలకం కావడంతో మాస్టర్లను పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్, మెట్లే బాధ్యత వహించాలని సూచించారు. ఉపాధి హామీ పథకం పట్ల ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు నిర్లక్ష్యం వహిస్తే శాఖ పరమైన చర్యలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బషరుద్దిన్, ఎంపీఓ సత్యనారాయణరెడ్డి, జిల్లా విజిలెన్స్ అధికారి ప్రశాంత్, ఎస్ఆర్పి మహేష్,ఏపీఓలు బిక్షపతి, మల్లేష్, టెక్నికల్ అసిస్టెంట్ గంగాధర్, పంచాయతీ కార్యదర్శులు నవీన్ కుమార్, దయానంద్, రాజేష్, ప్రశాంతి, రహేలా బేగం, గణేష్, సాయికుమార్, భరత్, సచిన్, నవీన్ గౌడ్, గీత, గురునాథ్, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.